క్లుప్తంగా

ప్రతిభ చాటిన అధ్యాపకులు



అధ్యాపకులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

నగరి: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఈ నెల 8వ తేదీన జరిగిన యూనివర్సిటీ స్టాఫ్ గేమ్స్‌లో నగరి డిగ్రీ కళాశాలకు చెందిన అధ్యాపకులు ప్రతిభ కనబరిచారు. టెన్నిస్ సింగిల్స్ విభాగంలో రాజనీతి శాస్త్ర విభాగం ఇన్‌చార్జ్ భాస్కర రాజు ప్రతిభ చూపి రన్నర్‌గా నిలిచారు. త్రోబాల్, బాల్‌బ్యాడ్మింటన్ మహిళా విభాగంలో బోటనీ అధ్యాపకురాలు అరుణ కుమారి టీమ్ రన్నర్‌గా నిలిచారని ప్రిన్సిపల్ వేణుగోపాల్ తెలియజేశారు. సోమవారం కళాశాలలో అధ్యాపకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ భాస్కర రాజు, ఎన్‌సీసీ ఆఫీసర్ భాస్కర్, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వేణుగోపాల్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్

పాలసముద్రం : స్థానిక పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద గర్భిణులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ శిశువు ఆరోగ్యంగా జన్మించేందుకు గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారంతోపాటు మజ్జిగ, పండ్ల రసాలు, ఆకుకూరలు, ఎక్కువగా నీరు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపరవైజర్లు సుశీల, మురళి పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో అన్నదానం



భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

గంగాధర నెల్లూరు : స్థానిక పీహెచ్‌సీలో రోగులకు కేశవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేశారు. వైద్యులు దుర్గాదేవి, ప్రవీణ్ మాట్లాడుతూ రోగులు ఆస్పత్రికి వచ్చే తిరిగి వెళ్లేందుకు ఆలస్యమవుతున్న తరుణంలో అన్నదానం చేపట్టడం ఎంతో ఉపయోగకరమని వెల్లడించారు. ఇందుకు సహకారం అందించిన ఎంపీ కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ మండల అధ్యక్షుడు పాపిరెడ్డి, సీహెచ్‌ఓ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ ధర్మేంద్ర, హెల్త్ అసిస్టెంట్ కదిరివన్ పాల్గొన్నారు.

లింగ వివక్ష నిర్మూలనకు కృషి



ర్యాలీ నిర్వహిస్తున్న ఐకేపీ సిబ్బంది

పాలసముద్రం : లింగ వివక్ష నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, గృహ హింస, బాల్య వివాహాలు లేని సమాజ నిర్మాణానికి సహకరించాలని ఐకేపీ ఏపీఎం కల్పలత తెలిపారు. సోమవారం ఈ మేరకు డ్వాక్రా సంఘాల లీడర్లు, సీసీలు, సంఘమిత్రలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, లోకనాథ, సంఘమిత్రలు మంజుల, మురగయ్య పాల్గొన్నారు.

వైభవంగా శంఖు పూజ



శివలింగాకృతిలో శంఖువులు

నగరి: మున్సిపల్ పరిధిలోని కీళపట్టు చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం తమిళ కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని 108 శంఖువుల పూజను వైభవంగా నిర్వహించారు. చంద్రమౌళీశ్వర స్వామిని, త్రిపురసుందరి దేవిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో శివలింగాకారంలో దీపాలను, బియ్యం 108 శంఖువులను ఏర్పాటు చేయగా భక్తులను అమితంగా ఆకర్షించింది. పరిహార లింగానికి స్వహస్తాలతో పాలాభిషేకం చేయడానికి భక్తులు బారులు తీరారు. ఆలయ నిర్వాహకులు సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పాలాభిషేకం చేయడానికి బారులు తీరిన భక్తులు

గంజాయ్

నగరిలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ



దేశ భవిత కోసం పాటు పడాల్సిన యువకులే గంజాయి మత్తులో ఎంజాయ్ చేస్తూ జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. తమ పిల్లలు మత్తుకు బానిసలయ్యారన్న చేదు నిజాన్ని సమాజంలోని ఎంతో మంది తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. పిల్లలు ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్న మనోవేదనతో కుమిలిపోతున్నారు. గంజాయి పూర్తి స్థాయిలో కట్టడి చేయకపోతే నేరాలు.. ఘోరాలు పెరిగే అవకాశం ఉందని, వాటిని అదుపు చేయడం కష్టమవుతుందని విశ్లేషకులు అంటున్నారు.

– సాక్షి టాస్క్‌ఫోర్స్

- గంజాయి మత్తులో జోగుతున్న యువత
- చోద్యం చూస్తున్న పోలీసు యంత్రాగం
- పెచ్చుమీరుతున్న నేరాలు.. ఘోరాలు

చిత్తూరు, తిరుపతి జిల్లాలో కాసుల వేటలో కొందరు రాజకీయ నాయకులు చేస్తున్న గంజాయి వికృత వ్యాపారానికి బంగారు భవిష్యత్తు కలిగిన యువత నాశనం అవుతోంది. గంజాయికి అలవాటు పడిన యువకులు నేరాలు..ఘోరాలకు పాల్పడుతున్నారు. విక్రయదారులపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి కొంత మందిని అరెస్టు చేసి సరుకు స్వాధీనం చేసుకుంటున్నారు. అయినప్పటికీ అమ్మేవారు, కొని వాడేవారు నానాటికీ పెరుగుతున్నారు. పోలీసులు గంజాయిని పూర్తి స్థాయిలో కట్టడి చేయాల్సి ఉంది. లేకుంటే నేరాలను అదుపు చేయలేని పరిస్థితికి సమాజం వెళ్లిపోతుందన్న నిజాన్ని గుర్తించుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పట్టణం నుంచి పల్లెలకు

ఒకప్పుడు ఎక్కడో పట్టణాల్లో విక్రయించే గంజాయి కాలక్రమేణా పల్లెకు చేరుకుంటోంది. విజయవాడ ప్రాంతాల్లో ఉన్న గంజాయి చిత్తూరు, తిరుపతి జిల్లాలో విచ్చలవిడిగా లభ్యమవుతోంది. ఈ పరిస్థితికి కూటమి ప్రభుత్వ వైఫల్యమే కారణమని తల్లిదండ్రులు వాపోతున్నారు. గంజాయికి అలవాటు పడిన యువకులు గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తున్నారు. అంతే కాకుండా ప్రశ్నించిన తల్లిదండ్రులు, ప్రజలపై కూడా దాడులు చేస్తున్నారు.



నాగరాజుకుప్పం సమీపంలో గంజాయి అమ్మేవారిని పట్టుకున్న పోలీసులు

మత్తుకు బానిసలు

చిత్తూరు ఉమ్మడి జిల్లాలో పట్టణ, గ్రామీణ మండలాల్లో యువకులు అత్యధికంగా ఈ మత్తుబారిన పడుతున్నారు. మొదటగా మద్యానికి బానిసై ఆ తరువాత గంజాయికి బానిసవుతున్నారు. గంజాయి సేవించినవారు పూర్తిగా మత్తులోకి జారుకోవడడంతో వారు ఏం చేస్తున్నారన్న విషయం వారికే తెలియని స్థితిలో ఉంటున్నారు. మద్యం, ఇతర మత్తు పదార్థాలకన్నా దీని ప్రభావం అత్యధికంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

ఇవీ ఘోరాలు

- నగరి పట్టణంలోని రామాపురం క్రషర్ గుంటలో ఐదుగురు యువకులు మద్యం మత్తులో ఓ వ్యక్తిని అత్యంత పాశవికంగా హత్య చేశారు.
- నగరి రూరల్ మండలం తడుకుపేట సమీపంలో రెండు నెలల క్రితం గంజాయి మత్తులో ఉన్న యువకులు ఓ దంపతులకు కత్తి చూపి బెదిరించి నగదు దోచుకున్నారు.
- నగరి రూరల్ మండలం నాగరాజుకుప్పం వద్ద గంజాయి విక్రయిస్తున్న తమిళనాడుకు చెందిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు.
- వడమాలపేట మండలంలో ఓ యువకుడు మూడేళ్ల బాలికపై అఘాయిత్యాన్నికి పాల్పడ్డాడు
- పుత్తూరు రూరల్ మండలం వేపగుంటలో యువకులు మద్యం మత్తులో అల్లర్లు సృష్టించారు.
- నెల క్రితం తిరుపతిలో నగరి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి గంజాయితో పట్టుబడ్డాడు.
- రెండు రోజులకు ముందు నాగరాజుకుప్పం వద్ద గంజాయి అమ్ముతున్న తమిళనాడు వ్యక్తులను పట్టుకున్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

మాదక ద్రవ్యాల నిర్మూలనపై వివిధ సంఘాలు నిరసనలు, ర్యాలీ చేసినా ఫలితం కనిపించలేదు. నానాటికీ విక్రయం, వినియోగదారులు పెరుగుతున్నారే తప్ప తగ్గలేదని దుమ్మెత్తిపోస్తున్నారు. ఒకటి, రెండు దాడులు చేసి చేతులు దులిపేసుకుంటున్నారని, గంజాయి అరికట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఫలితంగా యువత జీవితాలు ప్రశ్నార్థకంగా మారిందంటున్నారు.

యూటీఎఫ్ విజయంపై హర్షం



స్వీట్లు పంచుకుంటున్న యూటీఎఫ్ నాయకులు

నగరి: ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో యూటీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి విజయం సాధించడంపై యూటీఎఫ్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వారు స్వీట్లు పంచుకుని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) నేడు చారిత్రాత్మక విజయాన్ని ఉభయగోదావరి జిల్లాల్లో నమోదు చేసిందన్నారు. ఉపాధ్యాయ ఉద్యమానికి, సంక్షేమానికి జీవితాన్ని త్యాగం చేసిన చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి రోజున యూటీఎఫ్ ఎమ్మెల్సీగా గోపిమూర్తి విజయం సాధించడం ఉపాధ్యాయ లోకానికే గర్వించదగ్గ విషయమన్నారు. ఈ విజయం ప్రజాస్వామ్యానికి ఉద్యమానికి బాసటగా నిలిచిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మణిగండన్, రాష్ట్ర కౌన్సిలర్ పీఆర్ మునిరత్నం, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు వంశీకృష్ణ, యూటీఎఫ్ నగరి డివిజన్ నేతలు జనార్దన్, హరిదాస్, ప్రకాష్, సంతోష్ కుమార్, రమేష్, హరీష్, జయరామయ్య, హరి ప్రసాద్ రఘు, తదితరులు పాల్గొన్నారు.

ఇకపై ఉపేక్షించేది లేదు

- పందుల సంచారంపై మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక

నగరి: జనావాసంలో పందులు సంచరిస్తుండడంపై పెంపకందారులను ఇదివరలో పలుమార్లు హెచ్చరించామని అయినా వారిలో మార్పు రాలేదని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పందుల పెంపకందారులను మున్సిపల్ కార్యాలయానికి రప్పించిన ఆయన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్పు రాకుంటే చర్యలు తప్పవన్నారు. ఇదే చివరి హెచ్చరిక అని ఇకపై ఉపేక్షించేది లేదన్నారు. పందుల పెంపకందారుల నిర్లక్ష్యంతో ఎక్కువ సంఖ్యలో పందులు రోడ్లపై, వీధులపై సంచారిస్తున్నాయన్నారు. ఈ కారణంగా పట్టణ ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, వ్యాధుల వ్యాప్తికి దారి తీస్తోందన్నారు. ఈ అంశంపై పలుమార్లు కౌన్సులర్లు మౌఖికంగా ఫిర్యాదు చేశారన్నారు. నేటి నుంచి ఏడు రోజులు మాత్రమే చివరి గడువు అని ఆలోపు మార్పు తెచ్చుకుని పందులను జనసంచారంలేని ప్రాంతాలకు తీసుకెళ్లి మేపుకోవాలని హెచ్చరించారు. ఆపై పందులు జనసంచార ప్రాంతాల్లో కనిపిస్తే వాటిని దూరపు ప్రాంతాలకు తరలిస్తామన్నారు. జరిగే ఆర్థిక నష్టానికి పురపాలక సంఘం బాధ్యత వహించదన్నారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, మేనేజర్ శేఖర్, డీఈ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.



పందుల పెంపకందారులను హెచ్చరిస్తున్న మున్సిపల్ కమిషనర్

బాధిత కుటుంబానికి ఓదార్పు

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయినప్పుడే మనోధైర్యంతో ముందుకెళ్లాలని వైఎస్‌ఆర్ సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం పుత్తూరు మండలం రామసముద్రం పంచాయతీకి చెందిన జేసీఎస్ కన్వీనర్ దినేష్‌యాదవ్ తండ్రి రాఘవులు మండడి మృతి చెందారు. విషయం తెలుసుకున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి గ్రామానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్‌ఆర్ సీపీ అండగా ఉంటుందన్నారు. దినేష్ యాదవ్‌ను, అతని తల్లిని ఓదార్చి ధైర్యం చెప్పారు.



బాధిత కుటుంబాన్ని ఓదార్చుతున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

హైరిస్క్ గర్భిణులు అప్రమత్తంగా ఉండాలి

తవణంపల్లె : హైరిస్క్ గర్భిణులు రక్తపోటు రాకుండా జాగ్రత్తగా ఉండాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటప్రసాద్ సూచించారు. సోమవారం తవణంపల్లె పీహెచ్‌సీని తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 27 మంది హైరిస్క్ గర్భిణులకు వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ ప్రత్యేకంగా పరీక్షలు చేయించారు. ఈ కార్యక్రమాన్ని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటప్రసాద్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఆరో నెల నుంచి తొమ్మిదో నెల వరకు గర్భిణులు జాగ్రత్తగా ఉండాలన్నారు. కౌమార బాలికల ఆరోగ్యం, రక్తహీనత, వ్యక్తిగత శుభ్రత, వ్యాధి నిరోధక టీకాల ఆవశ్యకత గురించి వెల్లడించారు. ప్రభుత్వాస్పత్రిలో కాన్పు సురక్షితమని పేర్కొన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి, ఎల్‌టీ శేఖర్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక మాస పూజలు

బంగారుపాళెం : మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం కార్తీక మాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తమిళ కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో మొగిలీశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ ఆవరణలోని బిల్వ చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రదక్షిణ చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయ ఈవో మునిరాజులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాహుకేతు పూజలు..

మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఉదయం రాహుకాల సమయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దోష నివారణ పూజలలో పాల్గొన్నారు.

కార్తీక వన భోజనాలు..

మండలంలోని మొగిలివెంకటగిరి గ్రామంలో సోమవారం తమిళ కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని గంగమ్మ ఆలయం వద్ద కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ ఆవరణలో ఉన్న ఉసిరి చెట్టుకు మహిళలు పెద్ద ఎత్తున పూజలు చేసి కార్తీక దీపాలను వెలిగించారు. అదేవిధంగా మండలంలోని చీకూరుపల్లె సిద్దేశ్వరకొండపై కొలువైన శ్రీసిద్దేశ్వరస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకాలు, పూజలు చేశారు. పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు మురళీమోహన్, జరజాల జగన్‌మోహన్ స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం కార్తీక వనభోన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.



బంగారుపాళెం: శివాలయంలో రాహు కేతు పూజల్లో పాల్గొన్న భక్తులు

మానవ హక్కుల పరిరక్షణకు పోరాటాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మానవ హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలు చేస్తామని భారత సమ సమాజ అభివృద్ధి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తలారి కృష్ణమూర్తి తెలిపారు. ఆయన సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. మంగళవారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. త్వరలో అన్ని జిల్లాల్లో సంఘాలను ఏర్పాటు చేసి నాయకత్వాన్ని బలపరుస్తామన్నారు. ప్రతినెలా సివిల్ రైట్స్ డే సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాలపై ప్రజలకు తెలియజేసేలా చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్టు వివరించారు. యువతకు ఉపాధి, శిక్షణతో పాటు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా అవగాహన కల్పిస్తామన్నారు. చర్చ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల డిమాండ్లను పాలకుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు మునస్వామి, ధనుంజయరావు, బాబు, రాజ్ కుమార్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

బంగారుపాళెం : మండలంలోని కేజీ సత్రం వద్ద చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. దీంతో పరదరామికి చెందిన ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పరదరామి తాలూకా పూజారివలస ఎస్టీ కాలనీకి చెందిన రాకేష్, మేఘనాథం బంగారుపాళెం మండలం వెంకటాపురంలో మేస్త్రీ పని చేస్తున్నారు. సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. కేజీ సత్రం వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా పలమనేరు నుంచి చిత్తూరు వెళుతున్న కారు ఢీకొంది. మేఘనాథం కాలు విరిగి పోయింది. రాకేష్ తలకు బలమైన గాయమైంది. వారిని స్థానికులు 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు ఆపకుండా వెళ్లిపోవడంతో టోల్ గేట్ వద్ద స్థానికుల సాయంతో పట్టుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ మల్లప్ప తెలిపారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ఐరాల: గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత సూచించారు. పీహెచ్‌సీలో సోమవారం ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా 40 మంది గర్భిణులకు బీపీ, షుగర్, గుండె, మూత్ర, తదితర పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా 9 లేదా 10వ తేదీల్లో పీహెచ్‌సీలో గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. మాతా శిశు మరణాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పీహెచ్‌సీల్లో కాన్పులు చేయించుకునేందుకు గర్భిణులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఆకుకూరలు, తాజా పండ్లు, కూరగాయలు, గుడ్లు, పాలు రోజువారీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఐరాల: వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతపై జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులు రాకుండా చూడొచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని పాలకల రెడ్డివారిపల్లె, కుమ్మరపల్లె గ్రామాల్లో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో రెండు గ్రామాల్లో 85 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. డెంగీ, మలేరియా జ్వరాలు రాకుండా దోమకాటు నుంచి రక్షణ పొందడం, శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

వైఎస్సార్‌సీపీ నేతకు అభినందన



సతీష్ దంపతులను ఆశీర్వదీస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి

గంగాధర నెల్లూరు : నూతన గృహ ప్రవేశం చేసిన వైఎస్సార్‌సీపీ నేత సతీష్‌కు మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అభినందనలు తెలిపారు. సోమవారం మండలంలోని కొట్రకోన గ్రామానికి వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డితో కలిసి ఆయన విచ్చేశారు. గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వేల్కూర్ బాబు రెడ్డి, ముని రాజారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సుధాకర్ రెడ్డి, గోవిందరెడ్డి, వెంకటేష్ రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

పాలసముద్రం : మండలంలో నేటి నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అరుణ కుమారి తెలిపారు. సోమవారం ఈ మేరకు రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ పరిధిలోని సమస్యలపై సభలో అర్జీలు సమర్పించాలని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. రేషన్ సరుకులను డీలర్లు సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత వీఆర్‌ఓలపై ఉందని స్పష్టం చేశారు. గ్రామ సభ నిర్వహించే గ్రామంలో ఒకరోజు ముందు దండోరా వేయించాలని ఆదేశించారు. సమావేశంలో ఏఆర్ఐ దేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణకుమారి

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోండి



పల్లెచెరువులో మహిళలకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ కేశవనారాయణ



గోవిందరెడ్డిపల్లెలో వృద్ధులకు బీపీ పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె : పేదలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలకు ప్రత్యేకంగా పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లో వ్యాధులు సోకకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. లార్వా దశలోనే దోమలను అరికట్టాలన్నారు. అదేవిధంగా మండలంలోని పల్లెచెరువులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ రోగులకు పరీక్షలు చేశారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేసి మందులు అందజేశారు. జ్వరం వచ్చిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా కోటి దీపోత్సవం



శివ లింగానికి కలశాభిషేకం



కోటి దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

పుత్తూరు: పుత్తూరు పట్టణం ఆధ్యాత్మిక శోభతో పరిఢవిల్లింది. తమిళ కార్తీక మాస సోమవారాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన కోటి దీపోత్సవంతో భక్తకోటి పరవశించింది. ఉదయం స్థానిక శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆయలంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం ఆలయానికి తరలి వచ్చిన మహిళలు 365 వత్తులతో జ్యోతి ప్రజ్వలన చేశారు. కళాశాల మైదానంలో నిర్వహించిన కోటి దీపోత్సవంలో సాయంత్రం 4 గంటలకు మహాగణపతి పూజ, మృత్యుంజయ హోమం, మహాపూర్ణాహుతి, 108 శంఖాభిషేకాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం కార్తీక మాస విశిష్టతపై ప్రవచన కార్యక్రమం జరిగింది. రాత్రి 8 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మహిళలు కోటి దీపోత్సవాన్ని భక్తిపారవశ్యంతో కన్నుల పండువగా నిర్వహించారు. దీంతో ఆలయం, కళాశాల పరిసరాలు దీప కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందాయి.